క్లుప్తంగా

నేడు సీఈవో ఎంకే మీనా బందరు రాక

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం బందరు రానున్నారు. ఈయన ఉదయం 10 గంటలకు విజయవాడ నుంచి రోడ్డు మార్గం ద్వారా 11.30 గంటలకు మచిలీపట్నం చేరుకుంటారు. అనంతరం మచిలీపట్నం మండలంలోని రుద్రవరం గ్రామంలో కృష్ణా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు భోజన విరామం అనంతరం బయలుదేరి పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వెళతారు.

కౌలు హక్కుల వేలం వాయిదా

శ్రీకాకుళం(ఘంటసాల): మండలంలోని, శ్రీకాకుళం గ్రామంలో చల్లపల్లి ఎస్టేట్ దేవలయముల పరిధిలోని శ్రీ కాకుళేశ్వరస్వామి వారి దేవస్థానం భూముల కౌలు హక్కుల బహిరంగ వేలం వాయిదా వేసినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్.ఎస్.చక్రధరరావు బుధవారం తెలిపారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలోని శ్రీకాకుళేశ్వరస్వామి దేవస్థానానికి శ్రీకాకుళం, తెలుగురావుపాలెం, పాపవినాశనం, గోగినేనిపాలెం గ్రామాల్లో ఉన్న భూములకు దేవదాయ ధర్మదాయ శాఖ వేలం బుధ, గురు వారాల్లో నిర్వహించాల్సి ఉండగా రైతుల విజ్ఞప్తి మేరకు జూన్ 19వ తేదీకి వేలం కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ఈవో చక్రధరరావు తెలియజేశారు.

గ్రామోత్సవం

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీఅభయ ఆంజనేయస్వామి ఆలయం ఆధ్వర్యంలో బుధవారం రెండో రోజు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలతో ఆలయ నిర్మాణకర్త మలిశెట్టి సాంబశివరావు (నామాలు) పర్యవేక్షణలో వర్ఘుల నాంచారయ్య నేతృత్వంలో ఉత్సవం ఆరంభమైంది. పోటుమీద వస్తవ్యులు జూపూడి పురుషోత్తం దంపతులచే ఆకుపూజ, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భజన బృందం నేతృత్వంలో హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. మలిశెట్టి బాలాంజనేయులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు ఉత్సవ పూజలు జరుగుతాయని జూన్ ఒకటో తేదీ హనుమజ్జయంతి రోజున మహా అన్నసంతర్పణతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

మజ్జిగ పంపిణీ



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దర్శనంకోసం వచ్చే భక్తుల దాహార్తిని తీర్చుతున్న ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు, ప్రెస్ క్లబ్ సేవలు అభినందనీయమని ఎస్ఐ వైవీవీ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రం మోపిదేవి ప్రధాన గుడిసెంటర్‌లో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎండలను దృష్టిలో పెట్టుకుని భక్తులు, ప్రయాణికులకు చల్లని మజ్జిగ పంపిణీ చేపట్టడం సంతోషకరమన్నారు. విశ్రాంతి ప్రిన్సిపాల్ టీ సాంబశివరావు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు గోవిందరాజులు, అశ్వనీకుమార్, మండల పాత్రికేయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శాంతి కల్యాణం

మచిలీపట్నంటౌన్: నగరంలోని బచ్చుపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి శాంతి కల్యాణం అత్యంత భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. ఆలయ అర్చకుల పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పలువురు దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. శాంతి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ముత్తేవి రవికాంత్, కార్యనిర్వహణాధికారి చక్రధరరావు పర్యవేక్షించారు.

పూరిల్లు దగ్ధం



బోడగుంట(మోపిదేవి): మండల పరిధిలోని బోడగుంట ఎస్సీకాలనీలో మంగళవారం తెల్లవారుజామున బండెల ఏసురత్నంకు చెందిన గృహం మంటల్లో కాలి బూడిదయ్యింది. ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులు మంటల వేడికి మేల్కొని బయటకు పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నారు. అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఇంట్లో సామగ్రి పూర్తిగా కాలిపోవడంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. రూ.6 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారి ప్రసాదరావు బుధవారం తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

నలుగురి అరెస్ట్

చల్లపల్లి: ఇరువర్గాల ఘర్షణ కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సీహెచ్.చినబాబు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం ఈనెల 27న సోమవారం స్థానిక కూరగాయల సంతలో కొందరు యువకులు రెండు వర్గాలుగా కర్రలతో కొట్టుకున్నారు. ఈ కేసులో బుధవారం ఆకుల నాగబాబు, పత్తిపాటి సురేష్ బాబు, ఇస్సారపు శ్రీనివాసరావులను అరెస్ట్ చేసి మచిలీపట్నం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా అవనిగడ్డ సబ్‌జైలుకు తరలించారు. మరొకరు మైనర్ కావటంతో విజయవాడ జువైనల్ కోర్టులో హాజరుపరిచారు.

నిబంధనలపై అవగాహన అవసరం

పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి వెంకటరమణ



మాట్లాడుతున్న ఈఆర్వో వెంకటరమణ, డీఎస్పీ సుభాని

పెడన: ఓట్ల లెక్కింపు నియమ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, తప్పనిసరిగా నిబంధనలను పాటించాల్సిందేనని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి పి.వెంకటరమణ అన్నారు. బుధవారం ఆయన తన ఛాంబరులో పెడన అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఏజెంట్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి కౌంటింగ్ ప్రక్రియ గురించి తెలియజేశారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు 4న ఉదయం 5:30 గంటలకు కృష్ణా యూనివర్సిటీకి హాజరై, కౌంటింగ్ ఏజెంట్ల పాస్‌లతో పాటు ఫొటో ఐడీ కార్డులు వెంట తెచ్చుకోవాలని స్పష్టం చేశారు. పాస్ ఒక్కటే ఉంటే సరిపోదని, ఫొటో ఐడీ కార్డు కూడా తప్పనిసరిగా ఉండాల్సిందేనన్నారు. కౌంటింగ్ కోసం 14 టేబుల్స్, పోస్టల్ బ్యాలట్‌కు 3 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. తొలుత పోస్టల్ బ్యాలట్ లెక్కింపు ఉంటుందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు పూర్తయిన అర్ధగంటకు ఈవీఎం మిషన్ల కౌంటింగ్ పార్లమెంట్, అసెంబ్లీ వారిగా వేర్వేరుగా 14 టేబుల్స్ ఒక రౌండ్‌గా గుర్తించి 16 రౌండ్‌లలో లెక్కింపు పూర్తి చేస్తామన్నారు. కౌంటింగ్ పూర్తయ్యేవరకు ఏజెంట్‌లు, కౌంటింగ్ సిబ్బంది విధిగా కౌంటింగ్ హాల్‌లోనే ఉండాలని తెలిపారు. లెక్కింపు సమయంలో సందేహాలుంటే వాటిని అక్కడే నివృత్తి చేసుకోవాలని, అందుకు టేబుల్ సూపర్‌వైజర్ ఉంటారన్నారు. మచిలీపట్నం డీఎస్పీ అబ్దుల్ సుభాని మాట్లాడుతూ కౌంటింగ్ అయిన తరువాత రాజకీయ పార్టీలు ఎటువంటి విజయోత్సవ సమావేశాలు, ర్యాలీలు శాంతిభద్రతలు దృష్ట్యా నిషిద్ధమన్నారు.

అన్ని రాజకీయ పార్టీల వారు సహకరించవలసిందిగా ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థుల ప్రతినిధులు, ఏజంట్లు, అభ్యర్థులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ డీఎం'కు విశేష స్పందన



'డయల్ యువర్ డీఎం' కార్యక్రమంలో డీఎం హనుమంతరావు

అవనిగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు డీఎం హనుమంతరావుకు ఫోన్‌చేసి పలు సర్వీసుల గురించి తెలియజేశారు. మచిలీపట్నం సర్వీసుని ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళలో వయా రావివారిపాలెం మీదుగా నడపాలని కోరారు. మచిలీపట్నం నుంచి అవనిగడ్డ వచ్చే సర్వీసుని కాలేఖాన్‌పేట, బైపాస్ రోడ్డు వద్ద స్టేజీలుగా ఏర్పాటు చేయాలన్నారు. కరకట్ట సర్వీసులు టైమింగ్ ప్రకారం నడపడం లేదని, ముందు వచ్చిన సర్వీసులు కొన్ని అక్కడే నిలిపివేయడం, తరువాత వచ్చిన సర్వీసులు బయలు దేరిన తరువాత ఆలస్యంగా బయలు దేరడం చేస్తున్నారని కొంతమంది ఫోన్‌చేసి చెప్పారు. నర్సాపురం, నూజివీడు సర్వీసులను నడపాలని కోరారు. పాగోలు రోడ్డు వద్ద కరకట్ట సర్వీసులు తప్పనిసరిగా ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. మోపిదేవి గుడివద్ద ఆర్టీసీ సర్వీసులు ఆగేచోట బోర్డు ఏర్పాటు చేయాలని, దూర ప్రాంత సర్వీసులు ట్రాక్ కావడం లేదని, డ్రైవర్ నంబర్లు ప్రయాణీకులకు తెలిసేలా చూడాలని కోరారు. ఈ సూచనన్నింటినీ ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డీఎం హనుమంతరావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని భాస్కరపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 11కేవీ రైల్వే స్టేషన్ విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు రైలుపేట, భాస్కరపురం, రామానాయుడుపేట, బచ్చుపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

హనుమజ్జయంతి పూజలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హనుమజ్జయంతి పూజా కార్యక్రమాలను ఆయా ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బచ్చుపేట శ్రీ ప్రసన్నాంజనేయస్వామి స్వామి వారికి నాగవల్లి అర్చన నిర్వహించారు. హనుమత్‌తత్వంపై ప్రసంగం నిర్వహించారు.

హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం

బంటుమిల్లి: పాశ్చాపురంలో సువర్చలాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం నుంచి హనుమాన్ జయంతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. పండితులు రొంపిచర్ల హనుమంతాచార్యులు, డీవీ మేఘునరసింహకుమార్(ద్వారకా తిరుమల వేద పాఠశాల అధ్యాపకులు) శిష్య బృందం విశేష పూజలు నిర్వహించారు. తొలుత భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు బంటుమిల్లికి చెందిన శ్రీ నటరాజేశ్వరి కళానికేతన్ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, పలు గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

బంటుమిల్లి: మణిమేశ్వరం గ్రామానికి చెందిన అరవ నాగరాజు, ప్రసాదుల ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనగా తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ జి.వాసు తెలిపిన సమాచారం మేరకు.. ఈ నెల 28వ తేదీ రాత్రి నాగరాజు ద్విచక్రవాహనంపై తన బంధువు ప్రసాదును ఎక్కించుకుని అర్తమూరు లోని పెట్రోలు బంకులోకి వెళుతుండగా 216 జాతీయ రహదారిపై బంటుమిల్లి వస్తున్న ఆర్టీసీ ప్రైవేటు బస్సు ఢీ కొంది. ఈ ప్రమాదంలో నాగరాజు, ప్రసాదు గాయపడ్డారు. 108లో బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బస్సును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా మహా శాంతి హోమం



మహాశాంతి హోమంలో నిరంజనరావు, సత్యవతి దంపతులు

భావదేవరపల్లి(నాగాయలంక): స్థానిక శ్రీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పూషడపు నిరంజనరావు, శివసత్యవతి పీటలపై కూర్చోగా దుర్భా హరిబాబు స్వామి (తెనాలి) నేతృత్వంలో శాస్త్రోక్తంగా ఆలయంలో గత ఏడాది ప్రతిష్ఠిత దేవతా మూర్తులకు మహా సంప్రోక్షణ జరిపి శాంతి హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. తొలుత శ్రీకాశీవిశ్వేశ్వరునికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, దేవతా మూర్తులకు నూతన వస్త్రాలంకరణ పూజలు జరిగాయి. అన్నపూర్ణ దేవి, కాశీ విశ్వేశ్వరస్వామివార్ల మహా శాంతి కల్యాణం, తదుపరి భక్తులకు అన్నసంతర్పణ జరిపారు. దివిసీమ వ్యాప్తంగా భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీఅన్నపూర్ణదేవి, శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేడుకల్లో మండలి జ్యోత్స్న, కుంట సంధ్య, గ్రామ పెద్దలు, ప్రముఖులు పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మేలు



ఘంటసాల గ్రంథాలయంలో యోగా చేస్తున్న విద్యార్థులు



కొడాలి గ్రంథాలయం వద్ద లెమన్ అండ్ స్పూన్ ఆడుతున్న విద్యార్థులు

ఘంటసాల: ఘంటసాల మండలంలోని ఘంటసాల, కొడాలి గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు సందడిగా కొనసాగుతున్నాయి. కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాలతో నిర్వహిస్తున్న ఈ వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఘంటసాల గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎమ్. శరత్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థుల చేత కథల పుస్తకాలు చదివిస్తున్నారు. అంతేకాకుండా వారితో కథలు చెప్పించారు. అనంతరం యోగా పై అవగాహన తరగతులు నిర్వహించారు. మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. అలాగే కొడాలి గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులు కథలు పుస్తకాలు చదవడం, నీతి కథలు చెప్పించిన అనంతరం లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా..ఉల్లాసంగా పాల్గొన్నారు.

గూడూరు: వేసవి విజ్ఞాన శిబిరానికి మంచి స్పందన లభిస్తుందని గూడూరు శాఖా గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనం, క్యారమ్స్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహిస్తున్న శిబిరానికి వచ్చే విద్యార్థులు పుస్తక పఠనం పట్ల ఆసక్తి చూపుతున్నారన్నారు.

చల్లపల్లిలో..

చల్లపల్లి: గ్రంథాలయాల్లో వేసవిలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఎంతో ప్రయోజనమని విద్యుత్ శాఖ చల్లపలి డీఈఈ పులి శివ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం పురస్కరించుకుని విద్యార్థులతో ఆటలు ఆడించారు. మానసిక ఉల్లాసం, శారీరక బలం కోసం క్రీడల ప్రాముఖ్యత వివరించారు. వేసవి సెలవుల్లో గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదువుకోవాలని చెప్పారు. లైబ్రేరియన్ కే గణేష్ కుమార్ పర్యవేక్షించారు.

ఆర్అండ్‌బీ రోడ్డు ఆక్రమణ



అర్తమూరు గ్రామంలో ఆక్రమణ దారుని స్వాధీనంలో ఆర్అండ్‌బీ రోడ్డు

బంటుమిల్లి: మండలంలోని అర్తమూరు పంచాయతీ పరిధిలో ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డును సమీపంలోని రైతు అడ్డగోలుగా ఆక్రమించి మెరక చేసినా అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. 216 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఎన్‌హెచ్ అధికారులు స్థానిక రైతు వద్ద భూమి కొనుగోలు చేసి పరిహారం చెల్లించి రోడ్డు నిర్మాణం చేశారు. ఈ క్రమంలో గ్రామంలో నుంచి ఎన్‌హెచ్‌పైకి వెళ్లే పాత రోడ్డును మూసి వేశారు. అయితే ఈ రోడ్డు ఎడమ వైపున ఉండటంతో అధికారులు వినియోగించే అవకాశం ఉన్న పాత రోడ్డును మూసివేసి గ్రామంలోకి రాకపోకలకు కొత్త రోడ్డును నిర్మించారు. పాత రోడ్డుకు గడ్డర్లు అడ్డుగా పెట్టడంతో పాత రోడ్డు ఖాళీగా ఉండిపోయింది. అయితే ఈ పాత రోడ్డుపై రైతులు కళ్లాలు వేసుకుని ఉపయోగించే అవకాశం ఉన్నా రోడ్డు కోసం భూమి ఇచ్చిన రైతు తన ఇంటికి అనుకుని ఉండటంతో ఇతరులు ఎవరైన ఆక్రమిస్తారని భావించి ముందుగా పెద్ద ఎత్తున మట్టి తోలి తన స్థలంలో కలుపుకున్నాడు. ఈ ఆక్రమణలపై నేటికి ప్రభుత్వ శాఖల అధికారులు ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. కారణం రోడ్డు ఏ శాఖ పరిధిలో ఉన్నది అవగాహన లేనందున స్థానిక వీఆర్‌ఓ సైతం ఉదాసీన వైఖరి అవలంభిచారన్న విమర్శలు వస్తున్నాయి. అధికారులు స్పందించి ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ రోడ్డును స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ బంటుమిల్లి సెక్షన్ జేఈ కిషోర్ మాట్లాడుతూ ప్రస్తుతం రోడ్లన్నీ ఎన్‌హెచ్ పరిధిలోనే ఉన్నాయన్నారు. పాత రోడ్డు ఇంక ఆర్అండ్‌బీకి స్వాధీనం చేయలేదన్నారు. ఎన్‌హెచ్ అధికారిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా సంబంధిత అధికారుల సమాచారం లభించలేదు.

వైఎస్సార్ సీపీ విజయం కోరుతూ పూజలు



జలధీశ్వరస్వామికి పూజలు చేస్తున్న జనార్ధన, ఏఎంసీ చైర్మన్, జెడ్పీటీసీ, నేతలు

ఘంటసాల: రాబోయే ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించి మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కాంక్షిస్తూ వైఎస్సార్ సీపీ సీనియర్ నేత యార్ల జనార్ధనరావు ఆధ్వర్యంలో ఘంటసాలలో శ్రీ బాలపార్వతీ సమేత జలధీశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధనరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో దేవుని దయ ప్రజల ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 175 అసెంబ్లీ స్థానాలకు 175 మంది ఎమ్మెల్యేలు, 25 పార్లమెంట్ స్థానాల్లో 25 ఎంపీలు విజయం సాధించాలని శ్రీ జలధీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు చావలి కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలకు, నేతలకు, భక్తులకు ఘంటసాల పీఏసీఎస్ చైర్మన్ వేమూరి రత్నశేఖర్ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, జెడ్పీటీసీ తుమ్మల మురళీ కృష్ణ, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్ర బాబు, తెలుగు రావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ వేమూరి రత్న శేఖర్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగు పరచండి

- రెండు నెలలుగా అధ్వానం
- మెరుగయ్యేందుకు తక్షణ చర్యలు చేపట్టాలి
- కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ నాగకుమారి



కౌన్సిల్ అత్యవసర సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి

పెడన: పట్టణంలో రెండు నెలల నుంచి పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, మెయిన్ రోడ్ల వెంబడి పరిస్థితి బాగున్నా అంతర్గత రహదారుల్లో, ఇళ్ల నుంచి సేకరణ సక్రమంగా లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి అధ్యక్షతన సమావేశ హాలులో కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశం ఎన్నికల కోడ్ నియమనిబంధనలకు లోబడి ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతుల మేరకు కేవలం పారిశుద్ధ్యంపై చర్చించడానికి మాత్రమే ఈ సమావేశం ఏర్పాటు చేశామని, అందువల్ల సభ్యులు ఏమైనా పారిశుద్ధ్యంపై సలహాలు, సూచనలు ఇవ్వాల్సిందిగా సూచించారు. 8వ వార్డు కౌన్సిలర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల సమయం కావడంతో ప్రధాన రహదారులతో పాటు ఎన్నికల సమయం విధులు నిర్వహించాల్సిన ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సి రావడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేనందున తక్షణం అంతర్గత రహదారులతోను, ఇళ్లలో ఉన్న చెత్త సేకరణ పనులు సక్రమంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో ఆవుల బెడద ఎక్కువగా ఉందని, తక్షణం ఆ సమస్యను కూడా పరిష్కరించాల్సిందిగా కౌన్సిలర్ శివపావని కోరారు. కమిషనర్ వెంకటరామయ్య మాట్లాడుతూ తప్పకుండా దృష్టిపెట్టడం జరుగుతుందని, ఎంసీసీ కోడ్ అమల్లో ఉందని వివరించారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ బైలపాటి జ్యోతి, ఫ్లోర్ లీడర్ భళ్ల గంగయ్య, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరుకుటుంబ పండుగ



క్రీస్తు సందేశం ఇస్తున్న ఫాదర్ క్రీస్తురాజు

బందలాయిచెరువు(అవనిగడ్డ): మండల పరిధిలోని బందలాయిచెరువు ఎస్సీ కాలనీ ఆర్‌సీఎం చర్చిలో తిరుకుటుంబ పండుగను బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఫాదర్ గొరుముచ్చు క్రీస్తురాజు ఎస్సీ కాలనీలో ఇంటింటికీ తిరిగి ప్రార్థనలు చేసి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం స్థానిక ఆర్‌సీఎం చర్చిలో జరిగిన కార్యక్రమంలో ఫాదర్ క్రీస్తురాజు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు సందేశాన్ని అందించారు. ప్రతి ఒక్కరూ దేవుని సన్నిధానంలో గడపడం ద్వారా ప్రశాంతత లభిస్తుందన్నారు. క్రీస్తు బోధనలు అనుసరిస్తూ సమాజానికి క్రైస్తవులు ఆదర్శప్రాయులుగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా విశ్వాసులకు ఫాదర్ క్రీస్తురాజు దివ్యసత్ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఉపదేశి డేవిడ్, సంఘ పెద్దలు గొరుముచ్చు కోటేశ్వరరావు, ఆరిగ సుబ్బారావు, పరిశుద్ధరావు, దాసు పాల్గొన్నారు.

నేటి నుంచి అంకమ్మ తల్లి గ్రామోత్సవం

125 సంవత్సరాలుగా సంబరాలు



కె.కొత్తపాలెంలో ఉత్సవాల వివరాలు వెల్లడిస్తున్న కమిటీ సభ్యులు

కె. కొత్తపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని కె.కొత్తపాలెంలో కృష్ణానది ఒడ్డున అంకమ్మ తల్లి గ్రామోత్సవం రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి ఆలయం వద్ద బుధవారం కమిటీ సభ్యులు మాట్లాడుతూ జంపాన వారి దేవతగా పేరుగాంచిన అమ్మవారికి ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి, గత 125 సంవత్సరాలుగా గ్రామోత్సవం పెద్ద ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు. గురువారం అమ్మవారిని ఆలయం నుంచి బయటకు తీసి మేళతాళాలు, డప్పుకళాకారుల సందడితో సమీపంలోని పాలిమేర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం నది ఒడ్డున అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, టెంకాయలు మొక్కుబడిగా చెల్లించుకుంటారని తెలిపారు. అక్కడ నుంచి ఊరేగింపుగా గ్రామదేవతలు పోతురాజు, ఓలేరమ్మ, ఘంటాలమ్మ, మావెళ్లమ్మ, రామాలయం, ఆంజనేయస్వామివారి ఎదుట సంబరాలు చేస్తూ రెండో రోజు శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారు ఆలయ ప్రాంగణానికి చేరుకుంటారని చెప్పారు. ఆలయం వద్ద పెద్ద ఎత్తున సంబరాలు చేసి నైవేద్యాలు సమర్పించుకుంటారని, అనంతరం అమ్మవారి ఆలయ ప్రవేశం ఉంటుందని కమిటీ అధ్యక్షుడు జంపాన మాణిక్యాలరావు, పడమట సుబ్బారావు, పడమట వెంకటేశ్వరావు, రెడ్రౌతు రవిబాబు వివరించారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించండి



పోటీలో ప్రతిభ కనబరిచిన మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ మధ్యాహ్నభోజన విభాగం సూపరింటెండెంట్ ఎండీ సలీమ్ సూచించారు. నగరంలోని రుస్తుంబాద మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం నియోజకవర్గంలో మధ్యాహ్నభోజనం తయారీ ఏజెన్సీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సలీమ్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం ప్రతిరోజు వంటకాలను నాణ్యతతో తయారుచేయాలన్నారు. వంటకాలను నాణ్యంగా ఎలా తయారుచేయాలో వివరించే వీడియోను ప్రదర్శించారు. మధ్యాహ్న భోజనం తయారీపై మహిళలకు పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన మహిళలకు ధ్రువపత్రాలు అందజేశారు. ఎంఈవో ఎంవీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యకరంగా ఎదిగేందుకు మంచి పోషకవిలువలు ఉన్న ఆహారాన్ని అందించాలని సూచించారు. మరో ఎంఈవో వైఎస్ఆర్‌కే గురుప్రసాద్ మాట్లాడుతూ ఆహార పదార్థాలు తయారుచేసే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్ పద్మ, సీఆర్ఎంటీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవా సంస్థకు రూ.లక్ష విరాళం

అవనిగడ్డ: పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చైల్డ్‌హుడ్ స్వచ్ఛంద సేవా సంస్థకు గుడివాకవారిపాలెంకు చెందిన వ్యాపారవేత్త బండే శ్రీహరి వరప్రసాద్ లక్ష రూపాయలు విరాళం అందించారు. స్థానిక చైల్డ్‌హుడ్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో శ్రీహరి వరప్రసాద్ సోదరుడు బండే మాధవరావు ద్వారా సేవాసంస్థ అధ్యక్షుడు మత్తి శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇలాంటి దాతల ప్రోత్సాహం వల్ల చైల్డ్‌హుడ్ సేవాసంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. మరిన్ని సేవలు అందించేందుకు ఈ సహాయం దోహదపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున సహాయం అందించిన మాధవరావు తరుపున శ్రీహరి వరప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు చైల్డ్‌హుడ్ సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సంయమనం పాటించాలి



నాగాయలంక: స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం మండలంలోని రాజకీయ పక్షాల నాయకులు, గ్రామ, వార్డు, మండల స్థాయి నాయకులతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అవనిగడ్డ సీఐ పి. త్రినాథ్ మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఉన్నందున విద్వేషాలు, అల్లర్లకు పాల్పడకుండా సంయమనం పాటించాలని చెప్పారు. అవాంఛనీయ సంఘటనలను ప్రోత్సహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేవని, బాణసంచా కాల్చరాదని, బైకులకు సైలెన్సర్‌లు తొలగించి రైడింగ్ చేయరాదన్నారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని, మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందని ఎస్.ఐ ఎం.సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. 30 పోలీస్ యాక్ట్ ప్రకారం ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఘర్షణలకు పాల్పడినా నేరస్తులుగా మిగిలి పోతారని ఎస్ఐ పేర్కొన్నారు.